క్లుప్తంగా

16, 17 తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలు



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈనెల 16, 17 తేదీలల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలు ఏలూరులో నిర్వహించనున్నట్టు రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ తెలిపారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సమావేశాల కరపత్రాన్ని గురువారం సాయంత్రం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటోన్న అనేక సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాడనున్నట్టు చెప్పారు. ఏలూరులో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో పెద్ద సంఖ్యలో విద్యారుథులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆదర్శ ముఖ్యమంత్రి భట్టాచార్య

ఏలూరు (టూటౌన్): ఆదర్శ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ఆకస్మిక మృతికి సంతాపం తెలియజేస్తూ గురువారం సాయంత్రం సంతాప సభ నిర్వహించారు. నగర కార్యదర్శి పి.కిషోర్, సీనియర్ నాయకలు పి.ఆదిశేషు, వీజీఎంఆర్ కృష్ణారావు తదితరులు భట్టాచార్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

121 పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీల ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గం పరిధిలోని ఏలూరు అర్బన్ 64, రూరల్ పరిధిలో 57 పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. నగరంలోని గాంధీ నగర్ మున్సిపల్ స్కూల్, సుబ్బమ్మ దేవి మున్సిపల్ స్కూల్, శనివారపుపేట స్కూల్, మండలంలోని మాదేపల్లి, శ్రీపర్రు పాఠశాలల్లో ఎన్నికైన కమిటీలతో ఎంఈఓ–2 ఆర్ రంగయ్య ప్రమాణ స్వీకారం చేయించారు.

14న సీఆర్ఆర్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్మీడియట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్ బీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడంలో భాగంగా ఈ నెల 14న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ డ్రైవ్‌లో పాల్గొనే విద్యార్థులు తమ తల్లిదండ్రులతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 96663 22032, 96525 03799లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సీఆర్ఆర్ విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఆర్ఆర్ విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. గురువారం ఉదయం సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఏలూరు గైనార్ఫిక్లబ్, ఏలూరు హేలాపూరి లయన్స్ క్లబ్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ, సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం ఈ రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కొడాలి వెంకట సుబ్బారావు, పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని 119 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ఇంగ్లీష్ మీడియంతో సమాంతరంగా కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర, రాష్ట్ర కార్యదర్శి బీపీ సాల్మన్ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాంకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు నెలవారీ పదోన్నతులు కల్పించాలని, తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చిన తరువాతే రేషనలైజేషన్ ఉత్తర్వులు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.



శనివారపుపేట కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న తమ్మిలేరు



కొల్లేరులో కలిసే తూర్పు లాకులు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు

కాజ్‌వేపై తమ్మిలేరు పరవళ్లు

తమ్మిలేరుకు వరద నీరు పోటెత్తింది. ఏలూరు శనివారపుపేటలో బ్రిడ్జి పై నుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో కాజ్‌వేపై రాకపోకలను నిలిపివేశారు. ఇక్కడి వరద ఉధృతిని ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి పరిశీలించారు. నీటి ప్రవాహానికి వచ్చే అడ్డంకులను చెత్తను తొలిగిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రావణ్ కుమార్, నగరపాలక, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. – ఏలూరు (టూటౌన్)/ఏలూరు టౌన్



రాకపోకలు నిలిపివేసిన శనివారపు పేట కాజ్‌వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఖాజావలి



శనివారపుపేట కాజ్‌వే పై నుంచి నీటిలోనే వెళుతున్న వాహనచోదకులు



తమ్మిలేరు వరద ముంపుకు ముందస్తుగా ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు



ఏలూరులో తమ్మిలేరు వరదపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో రైతుల సౌకర్యార్థం ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు ఏలూరులోని ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో 241 నంబరు ప్రశ్నలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 26 జిల్లాలకు ఏడు ఇంక్యుబేషన్ కేంద్రాలు మాత్రమే ఉన్నాయని, ఏలూరు జిల్లాలో లక్ష మందికి పైగా ఉన్న పామాయిల్ రైతులు లబ్ధి కోసం ఏలూరు జిల్లాలో వ్యవసాయ పరిశోధన, ప్రాసెసింగ్, ఉత్పత్తి కేంద్రం (ఇంక్యుబేషన్ సెంటర్) ఏర్పాటు చేయాలని కోరారు. పోలవరం నిర్వాసితులు 1,20,000 మంది ఉన్నారని, వీరి కోసం నూతన ఉపాధి అవకాశాలు, నూతన సంస్కృతి, నూతన జీవన విధానం కోసం తగిన ఏర్పాట్లు చేయాలని కోరినట్టు వివరించారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి జితిన్ రామ్ మాన్ జీ స్పందిస్తూ ఏలూరులో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారని పేర్కొన్నారు.

జ్ఞానేశ్వరికి రూ.35 వేల విరాళం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల కాలేయ శ్యాధికి శస్త్ర చికిత్స చేయించుకున్న చిన్నారి జ్ఞానేశ్వరికి స్థానిక ఆదివారపు పేట శ్రీ షిరిడీ సాయి ప్రేమ మందిరం ఆధ్వర్యంలో రూ.35 వేల నగదును చిన్నారికి నాట్యం నేర్పుతున్న గురువు స్వర్ణలతకు అందజేశారు. గురువారం సాయి మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు ఇసుకపల్లి తాతారావు, గురువు వాసా ప్రసాదరావు అధ్యక్షతన ఈ మొత్తాన్ని ఆమెకు అందజేశారు.

రేపు దళిత క్రైస్తవుల నిరసన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దళిత క్రైస్తవులకు దళిత రిజర్వేషన్లు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన ఏలూరు నగర క్రైస్తవ శాఖలు, అభ్యుదయ వాదులు నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దుగ్గిరాల సంఘ కాపరి తోట ఎడ్వర్డ్ ఒక ప్రకటనలో కోరారు. నగరంలోని పీఠాధిపతులు, గురువులు, పాస్టర్లు, మఠకన్యలు, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ప్లకార్డులు, బ్యానర్లతో స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కథీడ్రల్ వద్దకు ఉదయం 10 గంటలకు చేరుకోవాలని పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థినుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అమీనా పేట హాస్టల్ విద్యార్థినులు

ఏలూరు (టూటౌన్): సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక అమీనాపేట సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థినులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ హైస్కూల్ స్థాయి నుంచి డిగ్రీ వరకు దాదాపు వెయ్యి మంది విద్యార్థినులు ఈ హాస్టల్స్‌లో ఉంటున్నట్టు చెప్పారు. హాస్టల్‌కు వెళ్లే రోడ్డులో మొదటి రెండు ఇళ్ల వరకే రోడ్డు ఉందని మిగతాదంతా అధ్వానంగా మారిదని, హాస్టల్ దగ్గర గోడ నుంచి సబ్ స్టేషన్ వరకు ఉన్న రోడ్డు నిర్మాణాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేశారంటూ అధికారులను ప్రశ్నించారు. వానాకాలం వస్తే విద్యార్థినులు రోడ్డు దాటి రావడానికి అనేక కష్టాలు పడుతున్నారని తెలిపారు. ఆడపిల్లల హాస్టల్‌లో డ్రెయినేజీ పొంగి ఉందని, ఈ సమస్యను గతంలో జిల్లా అధికారులకు అనేక సార్లు చెప్పిన పట్టించుకోలేదని గుర్తుచేశారు. డ్రెయినేజీ నీరు నిల్వ ఉండి దోమల ప్రభావం ఎక్కువగా ఉందని, విద్యార్థినులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్ చుట్టూ డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని లెనిన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. విద్యుత్‌తో జర భద్రం

- సమస్యలపై ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్ 1912
- నగరంలో మొత్తం విద్యుత్ సర్వీసులు 1,38,999

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వర్షాకాలం వచ్చిందంటే భారీ వర్షాలు, ఈదురుగాలు సహజం. ఆ సమయాల్లో విద్యుత్ తీగలు తెగి పడడం, స్తంభాలు ఒరిగిపోవడం, గోడల్లో ఎర్త్ రావడం వంటి ఘటనలు జరుగుతుంటాయి. కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తే ఇటువంటి ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. గృహ విద్యుత్ వినియోగదారులే కాక వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులకు కూడా పొలాల్లో రైతులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. గత మంగళవారం ఏలూరు నగరంలోని వంగాయగూడెం ప్రాంతంలో అశోక్ కుమార్ అనే వ్యక్తి మోటారు వేయడానికి వెళ్లి తెగిపడి ఉన్న విద్యుత్ వైరును చూసుకోకుండా తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందడం కలకలం రేపింది. ఏలూరు నియోజకవర్గంలో మొత్తం విద్యుత్ సర్వీసులు 1,38,999 ఉన్నాయి. వీటిలో గృహావసర, గృహేతర, పరిశ్రమలు, వ్యవసాయానికి సంబంధించిన సర్వీసులు ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షకాలంలో నివాసాల మధ్యలో ఉండే విద్యుత్ స్తంభాలను, వీటిని తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ టీవీ వైర్లనూ తాకే ప్రయత్నం చేయొద్దు.
- సబ్‌స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షణ తీగలకు దూరంగా ఉండాలి.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు, మరమ్మతులు చేయకూడదు.
- ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి.
- నీరు ఉన్న పరిసరాలు, వర్షం కురిసే, జల్లులు పడే అవకాశం ఉన్న చోట విద్యుత్ పరికరాలు ఉంచకూడదు.
- ట్రాన్స్‌ఫార్మర్లకు దగ్గరగా వెళ్లకూడదు.
- రైతులు, వ్యవసాయ కార్మికులు పంట పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో లేదో ఒకటికి రెండు, మూడు సార్లు పరిశీలించుకుని నీటిలోకి వెళ్లాలి.
- పొలాల వద్ద బోర్లకు రక్షణ కవచం ఏర్పాటుచేసుకోవాలి.
- పొలాల్లో మోటార్లు పని చేయకపోతే చేతితో పట్టుకోకూడదు. టెస్టర్ సహాయంతో మాత్రమే పరీక్షించాలి.
- స్టార్టర్ డబ్బాలను వర్షపు నీరు, తేమ తగలని చోట అమర్చి రక్షణగా కవర్ కప్పాలి. ఎర్తింగ్ తప్పనిసరిగా ఉంచుకోవాలి. మోటారుకు ఏదైనా మరమ్మతు చేయాలంటే ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేయాలి.



నగరంలోని రామకృష్ణాపురంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్

ఏలూరు నియోజకవర్గంలో	
విద్యుత్ సర్వీసులు	1,38,999
గృహావసర సర్వీసులు (కేటగిరి–1)	1,16,592
గృహేతర సర్వీసులు (కేటగిరి–2)	18,155
పరిశ్రమల సర్వీసులు (కేటగిరి–3)	281
వివిధ సంస్థల సర్వీసులు (కేటగిరి–4)	1938
వ్యవసాయ సర్వీసులు (కేటగిరి–4)	267
చేపల చెరువుల సర్వీసులు (కేటగిరి–4)	703
ఇతర సర్వీసులు (కేటగిరి–4)	2
వ్యవసాయ విద్యుత్ సర్వీసులు (కేటగిరి–5)	972
హెచ్‌టీ సర్వీసులు (కేటగిరి–5)	89

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలి. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. పలుచోట్ల స్తంభాలు పడిపోతున్నాయి. ప్రతి ప్రాంతంలో చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు ఉండదు. – జేపీబీ నటరాజన్, ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

ఆటుపోట్లకు గురవుతున్న చేనేత వృత్తి

ఏలూరు (టూటౌన్): పోగును వస్త్రంగా మలిచి మనిషి మానాన్ని కాపాడే చేనేత వృత్తి నేడు అనేక ఆటుపోట్లకు గురౌతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏపీ చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషును గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజగోపాలాచారి మాట్లాడుతూ ప్రపంచ ఆధునికీకరణలో భాగంగా అన్ని కులవృత్తులూ ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా కులవృత్తులపై ఆధారపడే వారు సమస్యలతోనే కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సంఘం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. చేనేత కార్మికుల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత బీసీల రాజ్యాంగ పరమైన హక్కులు సాధన దినం మండల్ డే సందర్భంగా బీపీ మండల్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి కింజంగి రాజు, తూర్పుకాపు నగర అధ్యక్షుడు అబ్బిరెడ్డి రంగ ముత్యాలు, బీసీ యువజన సంఘం కార్యదర్శి ఈదలాడ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆదిశేషును సత్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజగోపాలాచారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సంతోష్ నగర్, కొమడవోలు సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఆర్ఎంఎస్ కాలనీ, డీ మార్ట్ ప్రాంతం, మంచినీళ్ల తోట, చాణక్యపురి కాలనీ, కొమడవోలు, ఆటోనగర్, కొమడవోలు రోడ్డు, సాయి నగర్, హమాలీ కాలనీ, దుర్గ గ్రాండ్ సిటీ, ఆండాళ్లమ్మ తోట, రామ నగర్, మారుతి నగర్, మస్తాన్ మన్యం కాలనీ, నాగేంద్ర కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, శాస్త్రీ కాలనీ, చెంచుల కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పాలగూడెం, మాధవాపురం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- కోటదిబ్బ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అగ్రహారం, అంబికా సెంటర్, న్యూ మార్కెట్ ప్రాంతం, తూర్పు వీధి, మెయిన్ బజారు, టీచర్స్ కాలనీ, వెన్నవల్లివారి పేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, బావిశెట్టి వారి పేట, లంబాడీ పేట, బెనర్జీ పేట, కెనాల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రాజెక్టులపై పాలకుల నిర్లక్ష్యం



కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ప్రాజెక్టుల నిర్వహణపై పాలకుల నిర్లక్ష్యం రైతులకు, ప్రజలకు శాపంగా మారిందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. ఈ మేరకు స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో గురువారం ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆంధ్ర–తెలంగాణ సరిహద్దులోని ఏలూరు–భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో ఉన్న మీడియం ఇరిగేషన్ పెదవాగు ప్రాజెక్టుకు భారీ గండి పడి ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు మండలంలోని 12 గ్రామాలు తుడిచి పెట్టేసిందని, రోడ్లు దెబ్బతిని 30 గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని చెప్పారు. వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయని వివరించారు. ఆస్తి నష్టం అంచనా రూ.150 కోట్లకు పైగానే ఉందన్నారు. పెదవాగు ప్రాజెక్టు ఆయకట్టు పరిధి 16 వేల ఎకరాలు కాగా, ఇందులో వేలేరుపాడు పరిధిలో 13,640 ఎకరాలు, మిగిలినది అశ్వారావుపేట మండలంలో ఉందని చెప్పారు. వంద కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్టు నిర్వహణ పనులకు ప్రతిపాదనలు ఉన్నా పాలకులు స్పందించకపోవడం వల్లే ఈ నష్టం సంభవించిందని ఆరోపించారు. బుట్టాయగూడెం మండలం గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం నిర్వహణను గాలికి వదిలేశారని పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలో ఉన్న సాగు నీటి జలాశయాలు నిధుల కొరతతో, పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా నిర్వహణ లోపాలతో ఉన్నాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో పెద్దపీట వేశామని పాలకులు గొప్పగా చెప్పడమే తప్ప ఆచరణలో కనబడటం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో మైనర్, మీడియం సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు, వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

చెడు అలవాట్లతో భవిష్యత్తు నాశనం

గణపవరం: విద్యార్థి జీవితం ఎంతో విలువైందని, దీనిని చెడు అలవాట్లకులోనై పాడుచేసుకోవద్దని గణపవరం ఎస్సై వి.వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రసాయనశాస్త్రం, సోషల్ వర్కు, హెచ్‌ఆర్ శాఖల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం, అనర్థాలపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఎంతో విలువైన భవిష్యత్తు నాశనమవుతుందని, ఆరోగ్యం పాడై, చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. ఇటీవల యువత ముఖ్యంగా విద్యార్థులు మాదక ద్రవ్యాలపట్ల ఆకర్షితులవుతూ, విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. పాఠశాలలు కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి విద్యార్థీ పాఠశాలలోనే భోజనం చేయాలి

భీమడోలు: పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థీ మధ్యాహ్న భోజనం చేయాలని సమగ్ర శిక్షాభియాన్ జిల్లా బాలికా సంరక్షణాధికారిణి సబియా సుల్తానా అన్నారు. దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గురువారం ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడిందీ లేనిదీ పరిశీలించారు. శుభతిథి భోజనాలను ప్రతిరోజు అమలు చేయడం పట్ల ఆమె హెచ్ఎం మస్తాన్‌ను అభినందించారు. పాఠశాలకు హాజరైన 122 మంది బాలబాలికల్లో 108 మంది భోజనం చేశారు. పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థీ భోజనం చేసేలా ఉపాధ్యాయులు తగు శ్రద్ధ వహించాలని సూచించారు. ఎండీఎం నిర్వాహకులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు.